



# అమృత్ తెలంగాణ

తెలుగు దిన పత్రిక







సంపుటి: 01 సంచిక : 265. ఎడిటర్ : సింగిడి అమృత్ తెలంగాణ బుధవారం.09.07.2025 పేజీలు:4, వెల:రూ.1.00


## నాశనమైపోతావ్.. కేటీఆర్.. నిజాలు తెలుసుకొని మాట్లాడు..



ములుగు :అమృత్ తెలంగాణ: ”మేం సమ్మక్క, సారలమ్మ వారసులం.. ఆదివాసీ బిడ్డ జోలికి వస్తే నాశనమైపోతావ్ కేటీఆర్” అని మంత్రి సీతక్క వ్యాఖ్యానించారు. ములుగు నియోజకవర్గంలో నిజాలు తెలుసుకొని మాట్లాడాలని అన్నారు. మంగళవారం ములుగు జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పట్ల ఇష్టారాజ్యంగా మాట్లాడటం తగదని హెచ్చరించారు. ములుగులో ప్రజాపాలన, ఇందిరమ్మ పాలన సాగుతోందన్నారు. కేటీఆర్ దొర అహంకారం తగ్గించుకోవాలని, కుల, ధన బలం ఉండొచ్చని, కానీ తనకి నియోజకవర్గ ప్రజల బలముందని తెలిపారు. ములుగు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి బీఆర్ఎస్ ఓర్వలేకపోతున్నదని విమర్శించారు. బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో ఇచ్చిన హామీలు, నెరవేర్చిన హామీలు, ఇచ్చిన ఇండ్లు ఎన్నో లెక్క చూసుకొని రావాలని సవాల్ విసిరారు. కేటీఆర్ మిడుతల దండుతో ములుగుపై పడ్డాడని, ఓడిపోయిన నాయకులు ములుగు వచ్చి డ్రామాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం చనిపోయిన వారి ఇంటికి వెళ్లి పరామర్శించని వారు రోడ్లపై డ్రామాలు చేయడం సిగ్గు చేటని అన్నారు. పోలీసులు శాంతియుత ధర్నాకు అనుమతిస్తే కాన్వాయ్‌ని అడ్డుకోవాలని కుట్ర చేశారని అన్నారు. జులై 6 వరకు బీఆర్ఎస్ కార్యకర్తలపై పెట్టిన కేసులు ఎన్ని, మీ పాలనలో కాంగ్రెస్ కార్యకర్తలపై పెట్టిన కేసులు ఎన్నో తెలపాలన్నారు. దుబారు వేదికగా బీఆర్ఎస్ సోషల్ మీడియాలో ప్రచారం చేస్తున్న అబద్ధాలను మానుకోవాలని హితవు పలికారు. ములుగు నియోజకవర్గంలో సీడ్‌తో నష్టపోయిన 950మందికి కంపెనీల ప్రతినిధులతో రూ.4కోట్లు ఇప్పించేందుకు మంత్రి తుమ్మల, తాను వెళ్తుంటే అడ్డుకోవాలని చూశారని ఆరోపించారు. బుట్టాయిగూడెం, చల్వాయిలో చనిపోయిన వారు ఎందుకు చనిపోయారో ముందు కారణాలు తెలుసుకోవాలని అన్నారు. సిరిసిల్లలో ఇసుక లారీలతో తొక్కించి చంపింది, అడ్వకేట్లను చంపింది ఎవరో తెలియదా అని ప్రశ్నించారు. 70ఏండ్ల చరిత్రలో పంచాయతీరాజ్ శాఖకు ఒక కోయ ఆడబిడ్డ మంత్రిగా ఉంటే అక్కసు వెళ్లగక్కుతున్నారనీ, తనకు ఒక్క అవకాశం వస్తే ఓర్చుకోలేవా కేటీఆర్ అని అన్నారు. ఎన్నికల కోసం డ్రామాలడటం బీఆర్ఎస్‌కు తగదని తెలిపారు. ఈ కార్యక్రమములో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు పైడాకుల అశోక్, జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మెన్ బానోత్ రవి చందర్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రేగ కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

## అన్నిరంగాల విద్యార్థులకు అవకాశాలు



హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: అన్ని రంగాల విద్యార్థులకు అవకాశాలు తక్కేలా అంతర్జాతీయ సంబంధాలకు ప్రాధాన్యతనిస్తున్నట్టు కార్మికశాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి తెలిపారు. మంగళవారం హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆయన జర్మనీ ప్రభుత్వ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ టామ్‌కామ్ ద్వారా ఇప్పటికే నర్సులకు జర్మనీలో అవకాశాలు కల్పిస్తున్నామనీ, అదే విధంగా ఐటీఐ తదితర రంగాలకు చెందిన విద్యార్థులకు కూడా ఇలాంటి శిక్షణ ఇచ్చేలా భవిష్యత్తులో చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించారు. జర్మనీ ప్రతినిధులతో మంత్రితో పాటు కార్మికశాఖ ముఖ్య కార్యదర్శి ఎం.దాన కిశోర్ భేటీ అయ్యారు.జర్మనీ నుంచిబైన్కా మరియా కుంజ్ తదితరులతో పాటు జీఐజడ్ ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జర్మనీ ప్రభుత్వం, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా చేపట్టిన ట్రిపుల్ విన్ ప్రాజెక్టు పురోగతిపై చర్చించారు. జర్మనీలో అవకాశాల కోసం ఎంపిక చేసిన నర్సింగ్ ఆఫీసర్లకు జర్మనీ భాషపై ఉచితంగా శిక్షణ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఈ నెల 9 నుంచి 17 వరకు ట్రిపుల్ విన్ ప్రాజెక్టు -2024 బ్యాచ్‌కు చెంది.జర్మనీ భాషలో శిక్షణను విజయవంతంగా పూర్తి చేసుకున్న వారికి ఇంటర్వ్యూలు నిర్వహించనున్న సంగతి తెలిసిందే. హైదరాబాద్ సందర్శన సందర్భంగా తార్నాకలోని జర్మనీ ప్రతినిధులు టీజీఆర్టీసీ నర్సింగ్ విద్యార్థులను కలిశారు.జర్మనీలో నర్సింగ్‌ఆఫీసర్లకు ఇస్తున్న శాలరీ ప్యాకేజీ,కుటుంబవీసా స్పాన్సర్ షిప్ తదితర సౌకర్యాలను వివరించారు.

## యూరియా ఇవ్వండి... దేశీయ కోటా పెంచండి



న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: రాష్ట్ర అవసరాలకు కేటాయించిన యూరియాను సకాలంలో సరఫరా చేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్ రెడ్డి కేంద్ర ఎరువులు, రసాయనాల శాఖ మంత్రి జేపీ నడ్డాకు విజ్ఞప్తి చేశారు. ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం మంగళవారం కేంద్రమంత్రిని ఆయన అధికారిక నివాసంలో కలిశారు. వర్షకాలం సీజన్‌కు సంబంధించి ఏప్రిల్-జూన్ నెలల మధ్య 5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా కావల్సి ఉండగా, కేవలం 3.07 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే ఇచ్చారని కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. రాష్ట్రంలో ప్రాజెక్టులకు నీరు రావడంతో సాగు పనులు ప్రారంభమయ్యాయనీ, యూరియా సరఫరాలో ఆటంకాలు తలెత్తకుండా చూడాలని కోరారు. జులై నెలకు సంబంధించి 63 వేల మెట్రిక్ టన్నులు దేశీయంగా ఉత్పత్తి అయిన యూరియా, 97 వేల మెట్రిక్ టన్నుల విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న యూరియా రాష్ట్రానికి సరఫరా చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం 29 వేల మెట్రిక్ టన్నుల యూరియా మాత్రమే సరఫరా చేశారని వివరించారు. దేశీయంగా ఉత్పత్తి అవుతున్న యూరియా కోటాను తెలంగాణకు పెంచాలనికోరారు. యూరియా సరఫరా కోసం రైల్వే శాఖ తగిన రేక్‌లు కేటాయించడం లేదనీ, వాటి సంఖ్య పెంచాలని విజ్ఞప్తి చేశారు.

కేంద్రమంత్రి పీయూశ్ గోయల్‌తో భేటీ

జహీరాబాద్ ఇండిస్ట్రియల్ స్మార్ట్ సిటీ అభివద్ధికి సహకరించాలని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూశ్ గోయల్‌ను సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. దీనికోసం జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి, అమలు ట్రస్ట్ (ఎన్ఐసీఐటీ) ఆమోదించిన రూ.596.61 కోట్లను త్వరగా విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. స్మార్ట్ సిటీకి అవసరమైన నీటి సరఫరా, విద్యుత్ ఇతర వసతుల కల్పనకు ఆర్థిక సహాయం చేయాలని పేర్కొంటూ వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్-వరంగల్ పారిశ్రామిక కారిడార్‌లో భాగంగా వరంగల్ విమానాశ్రయానికి నిధులు మంజూరు చేయాలని అభ్యర్థించారు. హైదరాబాద్-విజయవాడ పారిశ్రామిక కారిడార్ సాధ్యాసాధ్యాల అధ్యయనం చేస్తున్నామని కేంద్రమంత్రికి తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ఆదిభట్లలో రక్షణ, ఏరోస్పేస్ పార్కును ఏర్పాటు చేసిందనీ, అందువల్ల హైదరాబాద్-బెంగళూర్ పారిశ్రామిక కారిడార్‌ను ఏరో-డిఫెన్స్ కారిడార్‌గా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. పెట్టుబడులకు సిద్ధంగా ఉన్న ప్లగ్ అండ్ ప్లే పారిశ్రామిక పార్కుల అభివృద్ధి ప్రతిపాదనలు ఇస్తామనీ, ఇక్కడ వందకు పైగా కంపెనీలు పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. కేంద్రమంత్రుల్ని కలిసిన బృందంలో సీఎంతో పాటు రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్‌రెడ్డి, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ శాఖ కార్యదర్శి రఘునందన్‌రావు, కేంద్ర పథకాల సమన్వయ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్ తదితరులు ఉన్నారు.


మాజీ పీఎం చంద్రశేఖర్‌కు నివాళి

దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రధానమంత్రిగా కే చంద్రశేఖర్ రాణించారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. చంద్రశేఖర్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జవహర్ లాల్ నెహ్రూ, ఇందిరా గాంధీ ప్రధాన మంత్రులుగా ఉన్న సమయంలో కాంగ్రెస్ నాయకునిగా పలు విధాన నిర్ణయాల్లో చంద్రశేఖర్ ప్రభుత్వానికి అండగా నిలిచారని చెప్పారు.

వైఎస్ఆర్‌ది చెరగని ముద్ర

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి, సంక్షేమం విషయంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి (వైఎస్ఆర్) చెరగని ముద్ర వేశారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. వైఎస్ఆర్ జయంతి సందర్భంగా ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డి అక్కడి తన అధికారిక నివాసంలో వైఎస్ఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందిరమ్మ ఇండ్లు, రైతు రుణమాఫీ, జలయజ్ఞం, ఔటర్ రింగు రోడ్డు, పింఛన్ల పెంపు వంటి కార్యక్రమాలతో ఉమ్మడి రాష్ట్ర ప్రజల్లో వైఎస్ఆర్ శాశ్వతంగా నిలిచిపోయారని తెలిపారు. రాహుల్‌గాంధీని ప్రధానమంత్రిని చేయాలని ఆయన ఎప్పుడూ చెప్పేవారనీ, ఆ ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని కోరారు.

## 17న జరిగే రైల్‌రోకో ట్రైలరే




న్యూఢిల్లీ :అమృత్ తెలంగాణ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కేంద్ర ప్రభుత్వం ఆమోదించకపోతే రైలు చక్రాల్ని ముందుకు కదలనివ్వబోమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుపై మంగళవారం నాడిక్కడ కాన్స్టిట్యూషన్ క్లబ్‌లో ఆమె మీడియాతో మాట్లాడారు. తెలంగాణలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించకుండా కాంగ్రెస్, బీజేపీ చేస్తున్న మోసాలకు నిరసనగా, బీసీ బిల్లును రాష్ట్రపతి ఆమోదించేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ఈనెల 17న రైల్‌రోకో నిర్వహిస్తున్నామన్నారు. ఇది కేవలం ట్రైలర్ మాత్రమేనని హెచ్చరించారు. బిల్లు ఆమోదం పొందకుంటే దక్కన్ నుంచి ఢిల్లీకి ఒక్క రైల్‌ను కూడా వెళ్లనివ్వబోమని చెప్పారు. బీజేపీ డీఎన్ఏలోనే బీసీ వ్యతిరేకత ఉందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో అనేక లోపాలు ఉన్నాయన్నారు. 2014లో కేసీఆర్ నిర్వహించిన సమగ్ర కుటుంబ సర్వేలో 52 శాతం బీసీలు ఉన్నట్టు తేలిందనీ, కాంగ్రెస్ సర్వేలో బీసీలు కేవలం 46 శాతానికే పరిమితమయ్యారని చెప్పారు. ఢిల్లీ పర్యటనల్లో సీఎం రేవంత్‌రెడ్డి హాఫ్‌సెంచరీ పూర్తి చేశారని ఎద్దేవా చేశారు. ప్రాంతీయ పార్టీలతోనే ప్రజలకు న్యాయం జరుగుతుందని అభిప్రాయపడ్డారు.

## రచ్చ తప్ప చర్చేదీ ?..బీఆర్ఎస్ ,వర్కింగ్ ప్రెసిడెంట్ ,కేటీఆర్




హైదరాబాద్ : అమృత్ తెలంగాణ: రచ్చ చేయడమే తప్ప చర్చించడం సీఎం రేవంత్ రెడ్డికి తెలియదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. రైతులు, యువతకు ఎవరేం చేశారో చర్చించాలంటూ సవాల్ విసిరిన ముఖ్యమంత్రి ఢిల్లీ పారిపోయారని ఎద్దేవా చేశారు. మరోసారి అవకాశమిస్తున్నాననీ, సమయం, స్థలం, తేదీ వారే నిర్ణయించి చర్చకు సిద్ధం కావాలని అన్నారు. చర్చించేందుకు సిద్ధంగా లేకుంటే వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. బూతులు మాట్లాడటమే తప్ప రైతుల గురించి రేవంత్ రెడ్డికి మాట్లాడటం రాదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులపై చర్చించాలని సీఎం రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరించిన కేటీఆర్ మంగళవారం హైదరాబాద్‌లోని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు వచ్చారు. వందలాది మంది అనుచరులు ఆయనను అనుసరించడంతో క్లబ్ గులాబీ శ్రేణులతో నిండిపోయింది. ఈ సందర్భంగా గౌరవ ముఖ్యమంత్రి అని రాసి ఉన్న ఖాళీ కుర్చీని వేదికపై ఉంచారు. ఆ పక్క కుర్చీలో కేటీఆర్ కూర్చున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలో 600 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారని విచారం ప్రకటిస్తూ బీఆర్ఎస్ నేతలు ఒక నిమిషం మౌనం పాటించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ 18 నెలలుగా 70 లక్షల మంది రైతులను, కోట్లాది కుటుంబాలను కాంగ్రెస్ దగా చేసిందని మండిపడ్డారు. హామీల అమలుకు గ్యారంటీ అంటూ నమ్మబలికి 18 నెలల తర్వాత కూడా ఒక్క హామీని నెరవేర్చలేదని తెలిపారు. రైతుల గురించి కనీస పరిజ్ఞానం లేకుండా సీఎం మాట్లాడుతున్నారనీ, అందుకే సిద్ధపడేందుకు 72 గంటల సమయమిచ్చినట్టు తెలిపారు. స్థలం, సమయం, తేదీ ముఖ్యమంత్రి ఇష్టానికే వదిలేసినట్టు చెప్పారు. అటు నుంచి సమాధానం రాకపోవడంతో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌కు మంగళవారం ఉదయం 11 గంటలకు తాము వస్తున్నామనీ, అక్కడే చర్చకు రావాలని కోరినట్టు తెలిపారు. సీఎం రాలేకపోయినా సరే ఆయన పక్షాన ఉప ముఖ్యమంత్రి గానీ, వ్యవసాయశాఖ మంత్రి గానీ, లేకపోతే ఎవరైనా మంత్రులు వచ్చినా తాము చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

నీళ్లు, నియామకాలు, నిధులను తెలంగాణ ప్రయోజనాలకు వ్యతిరేకంగా సీఎం రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. బనకర్లకు పచ్చజెండా ఊపుతూ, కృష్ణా నీటిని ఆంధ్రకు తరలిస్తే ఆయన కండ్లు మూసుకున్నారని మండిపడ్డారు. రైతుభరోసా, రైతు రుణమాఫీ దక్కని రైతుల జాబితాలు, ఆత్మహత్య చేసుకున్న రైతుల వివరాలు, బోనస్ రాక మిల్లర్లకు అమ్ముకుని నష్టపోయిన రైతుల జాబితాలతో తాను చర్చించేందుకు వచ్చినట్టు చెప్పారు. గత కాంగ్రెస్ పాలన నాటి రోజులను మళ్లీ తెచ్చారనీ, రాష్ట్రంలో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

మాట తప్పడం రేవంత్ రెడ్డికి అలవాటు

మాట తప్పడం, పారిపోవడం సీఎం రేవంత్ రెడ్డికి అలవాటేనని కేటీఆర్ ఎద్దేవా చేశారు. 2018లో కొడంగల్‌లో ఓడితే రాజకీయ సన్యాసం తీసుకుంటానని చెప్పి ఎంపీ ఎన్నికల్లో పోటీ చేశారని తెలిపారు. జీహెచ్ఎంసీలో బీఆర్ఎస్ సొంతగా గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటానని మరోసారి మాట తప్పి పారిపోయారని గుర్తుచేశారు. సోషల్ మీడియాలో పిల్లలు పోస్టు పెడితే గజ గజ వణికిపోయే సీఎం రేవంత్ రెడ్డితో చర్చించేందుకు కేసీఆర్ అవసరం లేదనీ, బీఆర్ఎస్‌లో ఏ నాయకుడైనా సరిపోతాడని అన్నారు. అసెంబ్లీలో మైక్ ఇవ్వకుండా కాలక్షేపం చేస్తున్నారనే విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని హెచ్చరించారు.

## 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు అడిషనల్ డీఎంఈలుగా పదోన్నతి

హైదరాబాద్ :అమృత్ తెలంగాణ: రాష్ట్రంలో వివిధ మెడికల్ కాలేజీలకు పాలనాధికారులు అందుబాటులోకి వచ్చారు. అన్ని కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లకు ప్రిన్సిపాల్స్, సూపరింటెండెంట్లను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు 44 మంది సీనియర్ ప్రొఫెసర్లకు మెడికల్ ఎడ్యుకేషన్ అడిషనల్ డైరెక్టర్లుగా పదోన్నతి కల్పిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. వారందరికీ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రిన్సిపాల్స్‌గా, టీచింగ్ హాస్పిటళ్లకు సూపరింటెండెంట్లుగా నియమించింది. దీంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలిసారిగా ప్రభుత్వ మెడికల్ కాలేజీలు, టీచింగ్ హాస్పిటళ్లకు రెగ్యులర్ పద్ధతిలో పరిపాలనాధికారుల నియామకం జరిగింది. అసోసియేట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న 278 మందికి ప్రొఫెసర్లుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ చివరి దశకు వచ్చింది. ఏడీఎంఈల పోస్టింగ్ ప్రక్రియ పూర్తయిన నేపథ్యంలో ప్రొఫెసర్లుగా ప్రమోట్ అయిన వారికి కూడా ప్రభుత్వం త్వరలో పోస్టింగ్స్ ఇవ్వనున్నది. ఈ ప్రమోషన్లతో అన్ని కాలేజీల్లో ప్రొఫెసర్ల కొరత, డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీల సమస్య తీరనున్నది. అసిస్టెంట్ ప్రొఫెసర్లుగా పని చేస్తున్న సుమారు 231 మందిని అసోసియేట్ ప్రొఫెసర్లుగా ప్రమోషన్లు ఇచ్చేందుకు వైద్యారోగ్యశాఖ ఇప్పటికే చర్యలు ప్రారంభించింది. అసోసియేట్ ప్రొఫెసర్, ప్రొఫెసర్, అడిషనల్ డీఎంఈ వంటి పోస్టులను నేరుగా రిక్రూట్ చేసుకునే అవకాశం లేకపోవడంతో, ప్రమోషన్ల ద్వారా ఈ పోస్టులను భర్తీ చేస్తున్నది. 607 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను నేరుగా భర్తీ చేసేందుకు మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఇటీవలే నోటిఫికేషన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఇవిగాక సుమారు మరో 714 పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ ఆమోదం తెలిపింది. ఈ పోస్టులను సైతం త్వరలోనే భర్తీ చేయనున్నారు.

ధన్యవాదాలు :టీటీజీడీఏ

అదనపు డీఎంఈ పదోన్నతులను పారదర్శకంగా, వేగంగా నిర్వహించినందుకు ప్రభుత్వానికి తెలంగాణ టీచింగ్ డాక్టర్స్ అసోసియేషన్ (టీటీజీడీఏ) ధన్యవాదాలు తెలిపింది. ఈ మేరకు మంగళవారం అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కిరణ్ బొల్లేపాక, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కిరణ్ మాదాల, ఉపాధ్యక్షులు డాక్టర్ కిరణ్ ప్రకాశ్ ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి, వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, కార్యదర్శి క్రిస్టీనా చొంగ్తూకు, వైద్యవిద్య డైరెక్టర్ డాక్టర్ నరేందర్ కుమార్‌కు, అదనపు డీఎంఈ డాక్టర్ వాణికి కృతజ్ఞతలు తెలిపారు.

కతజ్ఞతలు :టీజీడీఏ

పదోన్నతులు కల్పించినందుకు వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహకు, కార్యదర్శి క్రిస్టీనా చొంగ్తూకు, డీఎంఈ డాక్టర్ నరేందర్ కుమార్ కు తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీడీఏ) కృతజ్ఞతలు తెలిపింది. ఈ మేరకు ఆ సంఘం అధ్యక్షులు డాక్టర్ నరహరి, సెక్రెటరీ జనరల్ డాక్టర్ లాలు ప్రసాద్ రాథోడ్, కోశాధికారి డాక్టర్ ఎం.కె.రవూఫ్ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రిన్సిపాల్స్‌గా, సూపరింటెండెంట్లుగా నూతనంగా పదోన్నతి పొందిన 44 మందికి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ జూనియర్ డాక్టర్స్ అసోసియేషన్ వేరొక ప్రకటనలో ప్రభుత్వాని, ఉన్నతాధికారులను ధన్యవాదాలు తెలిపింది.

# మరణం లేని మహానాయకుడికి జోహార్లు : బోరంచు శ్రీకాంత్ రెడ్డి

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోయిన మహోన్నత నాయకుడు, మానవతావాది, డాక్టర్ వై.యస్. రాజశేఖర్ రెడ్డి ఎన్నటికీ మరిచిపోలేమని తెలంగాణ కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్ రెడ్డి అన్నారు. మావల లోని ఆయన నివాసంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వై ఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ శ్రేణులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జోహార్ వై ఎస్ ఆర్ అంటూ నినాదాలు చేస్తూ అయన చేసిన సేవలను కొనియాడారు. అనంతరం శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ డాక్టర్ వై.యస్.అర్. ఆనాడు ప్రజల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి, సామాజిక న్యాయ పరిరక్షణకు మార్గదర్శకుడిగా నిలిచారని కొనియాడారు. పేదవాడి సంక్షేమమే మూలసూత్రంగా, రైతన్న అభివృద్దే ధ్యేయంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పురోగతే లక్ష్యంగా పనిచేసిన మహానేత ఆయన అని గుర్తుచేశారు. రైతులకు ఉచిత విద్యుత్ , విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, పేదలకు ఆరోగ్యశ్రీ తో ఉచిత వైద్యం, 108 సేవలు, రూ.2 కే కిలో బియ్యం, రైతుల పొలాలను తడిపేందుకు జలయజ్ఞం వంటి పథకాలతో ఆయన ప్రజలగుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. యువత రాజకీయాల్లో ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మావల మండల అధ్యక్షులు ధర్మపురి చంద్రశేఖర్, యువజన కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి వేముల నాగరాజు, అసెంబ్లీ యూవజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సామా రూపేష్ రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ అట్ల గోవర్ధన్, కో ఆప్షన్ మెంబర్ రహీమ్ ఖాన్, యుభజన కాంగ్రెస్ టౌన్ ఉపాధ్యక్షులు రంజిత్ రెడ్డి, మావల మండల వర్కింగ్ ప్రెసిడెంట్ కోడూరుపాక సురేష్, NSUI మండల అధ్యక్షులు గౌతమ్, ఆఫ్సార్ ఖాన్, రెండ్ల రాజన్న, వెంకటేష్, దినేష్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు



నివాళులు అర్పిస్తున్న బోరంచు శ్రీకాంత్ రెడ్డి

# అదిలాబాద్ ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీస్ లో మీడియా సమావేశం శాసనసభ్యులు పాయల్ శంకర్

అమృత్ తెలంగాణ అదిలాబాద్ న్యూస్ : తెలంగాణలో కాంగ్రెస్, బి ఆర్ ఎస్ పార్టీలు రెండు కూడా ఈ రాష్ట్రంలో ప్రజా సమస్యలు చర్చకు రావద్దని ప్రజా సమస్యలను పక్కదారి పట్టించే విధంగా రాజకీయ సవాళ్లతో ఒకరిపై ఒకరు మీడియా వేదికగా విమర్శించుకుంటున్నారు. ఈ రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ తెలంగాణ శాసనసభకు నరేంద్ర మోడీ వస్తాడా కిషన్ రెడ్డి వస్తాడా చర్చిస్తామని అంటున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చెప్పదలుచుకున్నదొకటే తెలంగాణ శాసనసభకు ప్రధాన మంత్రి రాగలడా ముఖ్యమంత్రి తెలియదా అసెంబ్లీలో మేము స్పష్టంగా అడిగాము కూలిన కాళేశ్వరం ఏమైంది, ఫోన్ ట్రైపింగ్ వ్యవహారం ఏమైంది, కాళేశ్వరంలో అక్రమంగా సంపాదించిన సొమ్మంతా విదేశాలకు వెళ్ళింది గతంలో మీరు సిబిఐ ఎంక్వైరీ గురించి మాట్లాడారు అది ఏమైంది. ఆరోజు ప్రభుత్వం శాసనసభలో సమాధానం చెప్పకుండా నువ్వు ఏడ్చినట్టు చేయి నేను కొట్టినట్టు చేస్తా అంటూ ఇరు పార్టీలు వ్యవహరిస్తున్నాయి. లి రాష్ట్ర ముఖ్యమంత్రి స్వయంగా శాసనసభ సాక్షిగా చెప్పిండు కేంద్ర ప్రభుత్వం సహకరిస్తుంది అని. ఇతర మంత్రులు చెబుతూ ఈరోజు కేంద్ర ప్రభుత్వం నయా పైసా ఇవ్వడం లేదు అనడం ఇందులో ఏది నిజం చెప్పాలి.లి అసలు మంత్రివర్గంలోని ఇంత తేడా ఉంటే ఎట్లా ఈ రాష్ట్రాన్ని పరిపాలిస్తుందో వాళ్లు సమాధానం చెప్పాలి.లి మీరు విమర్శలు మాని ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే ప్రయత్నం చేయండి, ఏమైంది మీ హామీ ప్రతి మహిళకు 2,500 రూపాయలు ఇచ్చిన హామీ, ఏ ఒక్క మహిళకు అయినా 2500 మీరు ఇచ్చారా కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలి.కళ్యాణ లక్ష్మికి లక్ష రూపాయలు సరిపోతలేదు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ప్రతి బిడ్డకు తులం బంగారం అదనంగా పెడతాము అన్నారు, ఏమైంది నీ తులం బంగారం పెళ్లి చేసుకున్న జంటలకు తల్లిదండ్రులకు మీరు సమాధానం చెప్పాలి. డిగ్రీ చదువులు చదివే యువతులకు స్కూటీలు ఇస్తామన్నారు, ఎస్సీ ఎస్టీ మహిళలకు విద్యా బరోసా పేరు మీద ఐదు లక్షల స్కాలర్షిప్ ఇస్తామన్నారు కానీ ఐదు లక్షలు పెట్టిపోయినాయో తెలియదు కానీ కనీసం ఫీజు రియంబర్స్మెంట్ కూడా ఇవ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉంది. మీరు ప్రజలను మభ్యపెట్టింద్రు మీరు చెప్పిన హామీలను ఏ ఒక్కటి కూడా నిలబెట్టుకునే పరిస్థితిలో లేరు. లి ప్రజల నుండి వచ్చే వ్యతిరేకతను తప్పించుకోవాలని ప్రజల ఆగ్రహాన్ని డైవర్ట్ చేయడానికి ఒకరిపై ఒకరు మీడియా వేదికగా సవాళ్లు ప్రతి సవాళ్లు చేసుకుంటూ రాజకీయాలు చేస్తున్నారు. లి ముఖ్యమంత్రి గారు మాట్లాడుతారు ప్రతిపక్ష నాయకులు శాసనసభ సమావేశాలు పెట్టమని చెప్తే పెట్టమంటారు, శాసనసభ సమావేశాలు నిర్వహించే ది ప్రభుత్వం యొక్క బాధ్యత. గత పది సంవత్సరాలు ఈ రాష్ట్రాన్ని పరిపాలించినటువంటి బిఆర్ఎస్ పార్టీ అన్ని అక్రమాలు చేసిందని మీరే చెప్పారు కదా లక్షల కోట్లు విదేశాలకు తరలి వెళ్ళింది అని చెప్పారు కదా భారతీయ జనతా పార్టీ ఈరోజు ఈ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తుంది వెంటనే శాసనసభ సమావేశాలు నిర్వహించండి.లి దానిలో పది సంవత్సరాలు పాలించిన టిఆర్ఎస్ వాళ్లపై చర్చిద్దాం, 18 నెలలు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై చర్చ పెడదాం.

తెలంగాణ రాష్ట్రం వచ్చిన నుండి ఈ రాష్ట్రంలో జరిగిన స్కాములపై చర్చ పెడదాం, ప్రాజెక్టుల పైన చర్చిద్దాం, ఈ రాష్ట్రం ఇన్ని వేల కోట్ల అప్పుల పాలు ఎందుకు అయిందో దానిమీద చర్చిద్దాం. ఈరోజు ప్రతిపక్ష పార్టీలకు శాసనసభలో వీటన్నింటిపై చర్చ చేసే అవకాశం ఇవ్వండి.

గత ప్రభుత్వం చేసిన అవినీతి మీద ఈ ప్రభుత్వం ఇచ్చిన హామీల మీద భారతీయ జనతా పార్టీ నిలదీసే ప్రయత్నం చేస్తే మంత్రులందరూ కూడా మా గొంతు నొక్కే ప్రయత్నం చేస్తున్నారు.



మీడియా సమావేశం లో మాట్లడుతున్న శాసనసభ్యులు పాయల్ శంకర్

ఈరోజు పది సంవత్సరాలు మంత్రిగా పనిచేసినటువంటి కేటీఆర్ గారు ముఖ్యమంత్రి వస్తావా నేను తయారు ఉన్నాను అంటాడు , ప్రజలు అమాయకులు అనుకుంటున్నారా ఒక ఎమ్మెల్యే ప్రెస్ క్లబ్ కు వెళ్లి చర్చిస్తాను అంటే ముఖ్యమంత్రి వస్తాడ, పేపర్లలో మీ ఫోటోలు రావాలి మీడియాలో మీ మోకాలు కనిపించాలి కేవలం మీడియా మేనేజ్మెంట్ తోనే రాజకీయాలు నడపాలని ఈ రెండు పార్టీలు కూడా నాటకాలు ఆడుతున్నాయి. మేము ప్రభుత్వానికి చెప్పదలుచుకున్నాం. 10 సంవత్సరాలు జరిగిన అవినీతి తవ్వి తీసి జైలుకు పంపిస్తామన్నారు కదా, ఫోన్ టాపింగ్ ద్వారా, హావాలా ద్వారా లక్షల కోట్లు విదేశాలకు తరలించిన వాళ్లని కటకటాలకు పంపిస్తామని ముఖ్యమంత్రి ఆరోజు మల్కాజ్గిరి పార్లమెంటు సభ్యునిగా ఈ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షునిగా మాట్లాడిన మాటలు ఏమయ్యాయి. లి 18 నెలలు గడిచిన విచారణ పేరుమీద కాలం గడుపుతున్నారు. ఐదు సంవత్సరాలు మీరు విచారణలే చేస్తే ఈ దోషులకు శిక్షలు పడేటప్పుడు కాంగ్రెస్ పార్టీ సమాధానం చెప్పాలి. లి కాంగ్రెస్ పార్టీకి నిజంగా చిత్త శుద్ధి ఉంటే ఈ ప్రభుత్వానికి దమ్ము ధైర్యం ఉంటే శాసనసభ సమావేశాలు పెట్టండి. లి కేంద్ర ప్రభుత్వం ఈ ప్రభుత్వానికి ఈ రాష్ట్రానికి ఏం సాయం చేసిందో ఏ పథకానికి ఎన్ని లక్షల కోట్లు ఇచ్చిందో మేము చర్చకు సిద్ధంగా ఉన్నాము. లి నిన్న ఇబ్బందులకు గురై, 1200 మంది త్యాగాలు అర్పించి ఈ తెలంగాణ తెచ్చుకున్న మనం కాంగ్రెస్, బి.ఆర్.ఎస్ ఈ రెండు పార్టీల వల్ల ఈరోజు ఈ తెలంగాణ తెచ్చుకున్న తర్వాత కూడా నష్టపోతున్నది తెలంగాణ అభివృద్ధి ముందుకు పోలేక పోతుంది దానికి ఈ రెండు పార్టీలే కారణం.

ఈ మీడియా ద్వారా సవాళ్లు ప్రతి సవాళ్లు పక్కన పెట్టి ప్రజాసంక్షేమంపై దృష్టి పెట్టవలసిందిగా, శాసనసభను సమావేశపరచవలసిందిగా భారతీయ జనతా పార్టీ డిమాండ్ చేస్తుంది. కార్యక్రమంలో బిజెపి నాయకులు లాలమున్న మయూర్ చంద్ర జోగు రవి ఆకుల ప్రవీణ్. విజయ్ కుమార్ రాజేష్ కరుణాకర్ రెడ్డి రమేష్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

# ఫైర్ హోంగార్డు కుటుంబానికి 63 వేల చేయూత



అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్ : అగ్నిమాపక శాఖ,ఆదిలాబాద్ ఫైర్ స్టేషన్,లో పని చేసి రిటైర్డ్ అయిన ఎస్ డి , ఖలీల్ హోంగార్డు గత నెల బక్రీద్ రోజున చనిపోవడం జరిగింది. వారి కుటుంబానికి ఆర్థికంగా చేయూతను ఇవ్వడానికి అగ్నిమాపక శాఖ తరపున, ఇవ్వడం జరిగింది జిల్లా అగ్నిమాక అధికారి సురేష్ కుమార్ మరియు స్టేషన్ ఫైర్ ఆఫీసర్ ధారావత్ జయత్ రా0 మరియు అసోసియేషన్ ప్రెసిడెంట్ బి రామకాంత్ రెడ్డి అగ్నిమాపక శాఖలోని పనిచేస్తున్న అందరూ సిబ్బంది కలిసి, వారి కుటుంబానికి 63 వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించడం జరిగింది. ఆర్థిక సాయాన్ని కుటుంబానికి ఎంతో ఉపయోగపడుతుందని స్థానికులు తెలియజేశారు

# ప్రభుత్వం సబ్సిడీ ద్వారా అందిస్తున్న ఫర్టిలైజర్(యూరియా) ను అక్రమంగా తరలిస్తున్న ఐదుగురిపై కేసు నమోదు.

**విశ్వసనీయ సమాచారం మేరకు రెండు వాహనాలు సీజ్.**
**దాదాపు 150 బ్యాగుల్లో మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న ఫర్టిలైజర్.**
**ప్రభుత్వ అనుబంధ సంస్థ హకా ఉద్యోగుల అక్రమ నిర్వాకం**
**రైతుల సమాచారంతో పక్కాగా దాడి చేసి రెండు వాహనాలను పట్టుకున్న జైనథ్ పోలీసు సిబ్బంది.**
**150 బ్యాగు లు (దాదాపు 68 క్వింటాల్ )ల ఫర్టిలైజర్ మహారాష్ట్రకు తరలిస్తున్న నిందితులు.**
**ఆదిలాబాద్ డిఎస్పీ ఎల్ జీవన్ రెడ్డి.**

**అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి**

నిందితుల వివరాలు.

1) సునీల్ – HACA(హైదరాబాద్ అగ్రికల్చర్ కోఆపరేటివ్ అసోసియేషన్ )ప్రొప్రైటర్.
2) అజయ్ – హాక ఉద్యోగి.
3) నిఖిల్ – మహారాష్ట్ర ఫెర్టిలైజర్ దుకాణం యజమాని.
4) వాంకటే దిలీప్ – వాహన డ్రైవర్.
5) చిలకలవార్ చంద్రశేఖర్ – వాహన డ్రైవర్.

ప్రభుత్వం రైతులకు సబ్సిడీపై ఇస్తున్న ఫర్టిలైజర్ ను, తెలంగాణ రైతులకు అమ్మకుండా, అక్రమంగా మోసపూరితంగా వ్యవహరించి బాధ్యతగల హాకా నిర్వాహకులు మహారాష్ట్రకు అధిక ధరలకు అధిక లాభార్జనకు అమ్ముతున్నట్లు రైతుల ద్వారా లభించిన విశ్వసనీయ సమాచారం మేరకు రెండు వాహనాలను సీజ్ చేసి ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఆదిలాబాద్ డిఎస్పి ఎల్ జీవన్ రెడ్డి తెలిపారు. బేల మండలం నందు మార్క్ఫెడ్ అనుబంధ సంస్థ హైదరాబాద్ అగ్రికల్చర్ కో–ఆపరేటివ్ అసోసియేషన్ (హాకా HACA) ప్రొప్రైటర్ నిందితులు సునీల్, మరియు ఉద్యోగి అజయ్ లు మహారాష్ట్రకు సంబంధించిన ఫెర్టిలైజర్ దుకాణం యజమాని నిఖిల్ తో ఒప్పందం కుదుర్చుకొని దాదాపు మూడు లక్షల విలువచేసే ఫెర్టిలైజర్ను రెండు వాహనాలలో 150 బ్యాగుల్లో యూరియా ను అక్రమంగా తరలిస్తుండగా ఆ రెండు వాహనాలను సీజ్ చేసి, వాహన డ్రైవర్లైన వాంకడే దిలీప్, చిలకలవార్ చంద్రశేఖర్లపై, మొత్తం ఐదుగురిపై బేలా పోలీస్ స్టేషన్ నందు కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. ప్రత్యేకంగా రైతుల ద్వారా సమాచారం అందగా త్వరితగతిన స్పందించి జైనథ్ సిఐ డి.సాయినాథ్ మరియు బేల ఎస్సై నాగనాథ్ బృందం వారిని పట్టుకోవడం జరిగిందని, ఆదిలాబాద్ డిఎస్పీ ఎస్ జీవన్ రెడ్డి సంఘటన స్థలాన్ని పరిశీలించి వివరాలను వెల్లడించారు. వీరిపై సెక్షన్లు 316, 318 BNS ప్రకారం బేల పోలీస్ స్టేషన్ కేసు నమోదు చేసినట్టు తెలిపారు. స్వాధీనం చేసుకున్న రెండు వాహనాల నంబర్లు MH29M1958, AP01U5172 ఈ రెండు వాహనాలలో 150 బ్యాగుల్లో దాదాపు 67.5 క్వింటల ఫర్టిలైజర్ ను మహారాష్ట్రకు తరలించకుండా జిల్లా పోలీసు యంత్రాంగం అడ్డుకొని నిర్వాహకులపై కేసు నమోదు చేసిందని తెలిపారు. జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ ఐపీఎస్ గారు సూచనల మేరకు అక్రమంగా వ్యవహరిస్తున్న ప్రతి ఒక్కరిపై జిల్లా పోలీస్ యంత్రాంగం కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జైనథ్ సీఐ డి.సాయినాథ్, బేల ఎస్సై నాగనాథ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ఆదిలాబాద్‌లో నిషేధిత పురుగుల మందుల విక్రయం లో ఒకరి అరెస్ట్, రిమాండ్

**గుడిహత్నూర్ పోలీస్ స్టేషన్లో కేసు నమోదు**
**30 బాటిళ్లు స్వాధీనం**
**ఉట్నూర్ ఏఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్**

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : తెలంగాణలో నిషేదితమైన పురుగుల మందులను విక్రయిస్తున్న ఒక వ్యక్తిని గుడిహత్నూర్ పోలీసులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. సీతాగొండికి చెందిన వ్యవసాయ విస్తరణాధికారి లక్కపతి శ్రీధర్ ఫిర్యాదు మేరకు, ఉట్నూర్ ఏఎస్పి కాజల్ సింగ్ ఐపీఎస్ తెలిపిన వివరాల ప్రకారం, జూలై 6, 2025న మధ్యాహ్నం 2:00 గంటల సమయంలో, సీతాగొండి గ్రామానికి చెందిన నిందితుడు బట్టువార్ వినోద్ (తండ్రి: వసంత్) అనే వ్యక్తి అమాయక రైతులకు తెలంగాణలో నిషేధించిన "రౌండప్" అనే పురుగుల మందును విక్రయిస్తున్నాడని విశ్వసనీయ సమాచారం అందుకున్న గుడిహత్నూర్ పోలీసులు. అనంతరం, పోలీసులు ఫిర్యాదుదారుడితో కలిసి వినోద్ ఇంటికి చేరుకొని, నిషేధిత పురుగుల మందు "రౌండప్" సీసాలను విక్రయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. విచారణలో, నిందితుడు తనను తాను బట్టువార్ వినోద్ (46), వృత్తి వ్యాపారం, సీతాగొండి నివాసిగా గుర్తించాడు. ఈ నేరాన్ని అంగీకరిస్తూ, మహారాష్ట్ర బోరి గ్రామం నుండి తక్కువ ధరకు నిషేధిత రౌండప్ పురుగుల మందు సీసాలను కొనుగోలు చేసి, సొంత లాభం కోసం తెలంగాణ రాష్ట్రంలోని బెలా కు అధిక ధరకు రవాణా చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. తరువాత, ఇతని వద్దనుండి పోలీసులు 30 రౌండప్ (గ్లైఫోసేట్ 41% ఎస్ఎల్) 1 లీటర్ పురుగుల మందు సీసాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక్కో సీసా విలువ రూ. 795/- కాగా, స్వాధీనం చేసుకున్న మొత్తం విలువ రూ. 23,850/-. వ్యవసాయ విస్తరణాధికారి కేసు నమోదు కై పోలీస్ స్టేషన్‌కు వచ్చి, నిందితుడిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. పైన పేర్కొన్న ఫిర్యాదు ఆధారంగా, పోలీసులు క్రైమ్ నంబర్ 138/2025 కింద భారతీయ న్యాయ సంహిత (BNS) సెక్షన్ 318(4) మరియు పురుగుల మందుల చట్టం సెక్షన్ 29(i)(d) కింద కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్ జారీ చేసి గౌరవనీయ కోర్టుకు పంపగా ఇతనికి 14 రోజుల జ్యుడీషియల్ రిమాండ్కు తరలించడం జరిగిందని తెలిపారు. నిషేధిత మందులను అమ్మిన కలిగి ఉన్న వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.




# ఇచ్చోడలో యువతిని వేధిస్తున్న డాక్టర్ పై కేసు నమోదు, అరెస్టు

**ఇదివరకే ఒకసారి కేసు నమోదు అరెస్టు అయిన డాక్టర్.**
**ఇచ్చోడా సీఐ బండారి రాజు**

**అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ న్యూస్**

నిందితుడి వివరాలు

సయ్యద్ ఆసిమ్ (తండ్రి: సయ్యద్ లతీఫ్), వయస్సు: 41 సం., వృత్తి: ఆర్ఐఎంఎస్ ఆదిలాబాద్‌లో మెడికల్ ఆఫీసర్, నివాసం: ఇంటి నెం. 5-78/22, బైల్ బజార్, ఇచ్చోడ గ్రామం, మండలం. ఆదిలాబాద్ జిల్లాలోని ఇచ్చోడ మండలంలో ఓ యువతిని నిరంతరం వేధింపులకు గురిచేస్తున్న యువకుడిపై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలి తండ్రి షేక్ అబ్దుల్ రెహమాన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ చర్య తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, ఇచ్చోడలోని టీచర్స్ కాలనీకి చెందిన షేక్ అబ్దుల్ రెహమాన్ (52) తన కుమార్తె ను నిందితుడు సయ్యద్ ఆసిమ్ (45) అనే వ్యక్తి నాలుగు నెలలుగా వేధిస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఆసిమ్ అమ్మాయిని ప్రేమించి పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నాడని పేర్కొన్నారు. అబ్దుల్ రెహమాన్ గతంలో కూడా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, అప్పుడు కేసు కూడా నమోదైందని తెలిపారు. అయినప్పటికీ, సయ్యద్ ఆసిమ్ ప్రవర్తనలో ఎటువంటి మార్పు రాలేదని, గత 12 రోజులుగా అతను తన కుమార్తెను నిరంతరం వెంబడిస్తూ, తమ బంధువులు, పొరుగువారు మరియు గ్రామస్తుల ముందు తన కుమార్తెను పెళ్లి చేసుకుంటానని బహిరంగంగా ప్రకటిస్తున్నాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ చర్యల వల్ల తమ కుటుంబ ప్రతిష్టకు భంగం వాటిల్లుతోందని, తమ కుమార్తెకు పెళ్లి సంబంధాలు కూడా రావడం లేదని అబ్దుల్ రెహమాన్ ఆవేదన వ్యక్తం చేశారు. సయ్యద్ ఆసిమ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పోలీసులను కోరారు. ఈ ఫిర్యాదులోని అంశాల ఆధారంగా, పోలీసులు క్రైమ్ నంబర్ 219/2025 కింద భారతీయ న్యాయ సంహిత (BNS)లోని సెక్షన్లు 74, 79 ప్రకారం కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించడం జరిగిందని ఇచ్చోడ సీఐ బండారి రాజు తెలిపారు.



# జిల్లాలో ఆరోగ్య, విద్య, పర్యావరణ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి సారించి మంగళవారం బోథ్ నియోజక వర్గంలో పలు కార్యక్రమాల్లో పాల్గొన్న జిల్లా పాలనాధికారి రాజర్షి షా.





వన మహోత్సవం సందర్భంగా బోథ్ ts రెసిడెన్షియల్ స్కూల్ , పొచ్చేర రెడ్డి ఫంక్షన్ హాల్ ఆవరణలో మంగళవారం మొక్కలు నాటిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా





బోథ్ లో నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకస్మికంగా తనిఖీ చేసి నిర్మాణ పనుల తీరును కాంట్రాక్టర్ ను అడిగి తెలుసుకొని, వివిధ కారణాల వల్ల ప్రభుత్వ ఆసుపత్రిలో అడ్మిట్ అయినా రోగులను పరామర్శించి అందిస్తున్న వైద్య సేవల ను అడిగి తెలుసుకుంటున్న దృశ్యం





ఆరోగ్య పాఠశాల కార్యక్రమం లో భాగంగా బోథ్ ts రెసిడెన్షియల్ స్కూల్ లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమం లో ముఖ్య అతిథిగా పాల్గొని, గ్రంథాలయం, విద్యార్థుల సిక్ రూం ను పరిశీలించిన జిల్లా కలెక్టర్ రాజర్షి షా

అమృత్ తెలంగాణ ఆదిలాబాద్ ప్రతినిధి : మొదటగా ఆరోగ్య పాఠశాల కార్యక్రమం లో భాగంగా, బోథ్ TS రెసిడెన్షియల్ స్కూల్ లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్, స్కూల్ గ్రంథాలయం, విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన సిక్ రూం ను పరిశీలించారు. వన మహోత్సవం సందర్భంగా, కలెక్టర్ రాజర్షి షా బోథ్ TS రెసిడెన్షియల్ స్కూల్ , పొచ్చేర రెడ్డి ఫంక్షన్ హాల్ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణపై ఆయన విద్యార్థులకు చైతన్య వాహిని కలిగించారు. తదుపరి, బోథ్ లో నిర్మాణంలో ఉన్న వంద పడకల ప్రభుత్వ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్, నిర్మాణ పనుల పురోగతిని కాంట్రాక్టర్‌ను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, అందిస్తున్న వైద్య సేవలపై వారి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. ఆరోగ్య పాఠశాల కార్యక్రమం లో భాగంగా ప్రతీ రోజు ఒక అంశం పై విద్యార్థులకు అవగాహన కల్పించడం జరుగుతున్న సందర్భంగా మంగళవారం "న్యూట్రిషన్ డే" (పోషకాహార అంశం పై) బోథ్ TS రెసిడెన్షియల్ స్కూల్ లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ రాజర్షి షా విద్యార్థులతో సంభాషిస్తూ, ఆరోగ్యానికి పోషకాహారం ఎంత ముఖ్యమో వివరించారు. సమతుల్యాహారం తీసుకోవడం ద్వారా శారీరక, మానసిక వికాసం సాధ్యమవుతుందని ఆయన సూచించారు. కార్యక్రమంలో విద్యార్థులకు విటమిన్లు, ఖనిజాలు, ప్రోటీన్లు కలిగిన ఆహారం గురించి అవగాహన కల్పించారు. ఆరోగ్య దినచర్యలు, శుద్ధినీటి ప్రాముఖ్యత, వ్యక్తిగత శుభ్రత పై కూడా విద్యార్థులను చైతన్యవంతం చేశారు. ముందుగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ను రెసిడెన్షియల్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు సంగీత విద్యార్థులతో ఘనంగ స్వాగతం పలికారు.

విద్యార్థులు పౌష్టికాహారం స్కిట్ పై ప్రదర్శించిన తీరుఆకట్టుకున్నాయి.

అనంతరం గ్రంథాలయాన్ని సందర్శించి విద్యార్థులకు సంబందించిన అన్ని బుక్స్ తో పాటు తెలుగు, ఇంగ్లీష్ వార్త పేపర్లు అందుబాటులో ఉంచాలని తెలిపారు. వంద పడకల ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసి వార్డుల వారిగా సందర్శించి వైద్య సేవల పై ఆరా తీసి, వైద్యులు సకాలం లో వస్తున్నారా, అందుబాటులో ఉంటున్నారా, అడిగి తెలుసుకొని, నూతనంగా నిర్మిస్తున్న వంద పడకల ఆసుపత్రిని సందర్శించి నిర్మాణ పనులను పరిశీలించి వేగవంతంగా నాణ్యతతో కూడిన నిర్మాణ పనులు చేపట్టాలని ఆన్నారు. ఈ కార్యక్రమంలో డీఈఓ శ్రీనివాస్, mro సుభాష్ చందర్, అజయ్ రిసోర్స్ పర్సన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ అవసరాలకు సరిపడినంత ఇసుకను అందుబాటులో ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.




సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా పాలనాధికారి అభిలాష అభినవ్



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి : మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లాలో ఇసుక లభ్యత, వివిధ నిర్మాణాలకు ఇసుక సేకరణ, ఇసుక అక్రమ రవాణా నియంత్రణ, భూ భారతి చట్టం, సిఎంఆర్ డెలివరీ, రేషన్ కార్డులు, తదితర అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, వచ్చే సంవత్సరం మార్చి నెల వరకు వివిధ ప్రభుత్వ నిర్మాణాలకు అవసరమగు ఇసుక అంచనా అవసరాల నివేదికలను పంపాలన్నారు. త్వరలోనే రాష్ట్ర వ్యాప్తంగా ఇసుక బజార్ లను ఏర్పాటు చేసి, ఆన్ లైన్ విధానంలో విక్రయాలను చేపట్టనున్నట్లు తెలిపారు. ఆన్ లైన్ ఇసుక విక్రయాల విధానం అమలుతో ఇసుక సేకరణలో పారదర్శకత పెరుగుతుందని అన్నారు. దీనికి సంబంధించి ఇసుక నిల్వ ఉంచుటకు తహసిల్దార్లు స్థలాలను గుర్తించాలని అన్నారు. ప్రభుత్వ నిర్మాణాలలో వినియోగించే గ్రానైట్, ఇతర మెటీరియల్ సేకరణకు జీరో పర్మిట్ విధానాన్ని అందుబాటులోకి తేనున్నట్లు చెప్పారు. జీరో పర్మిట్ అర్హత పొందేందుకు సంబంధిత గుత్తేదార్లు తప్పనిసరిగా ఎండిఎల్ లైసెన్సు పొందాలన్నారు. ఈ విధానంలో ప్రభుత్వం అనుమతించిన క్వారీల నుంచే నిర్మాణ ముడి పదార్థాలు పొందాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాల కొరకు అవసరమగు ఇసుకను లభ్యంగా ఉంచుకోవాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుక కొరత రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. జిల్లాలలో ప్రత్యేకించి ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ అవసరాల కోసం అదనపు ఇసుక రీచ్ లను గుర్తించాలని తెలిపారు. జిల్లాలో ఇసుక అక్రమ రవాణాను పూర్తి స్థాయిలో నియంత్రించాలని అధికారులను ఆదేశించారు. ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ, ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అన్ని మండలాల్లో ఇసుక ధరలు నియంత్రణలో ఉంచాలన్నారు. అనంతరం భూభారతి చట్టం అమలుపై తహసీల్దారులతో సమీక్షించారు. మండలాల వారిగా భూ భారతి గ్రామ రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులు, పూర్తి చేసిన ఆన్ లైన్ ప్రక్రియ, జారీ చేసిన నోటీసులు, పరిష్కరించిన భూ సమస్యల వివరాలను తహసిల్దార్లను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే భూ సమస్యల దరఖాస్తుల ఆన్ లైన్ ప్రక్రియను పూర్తి చేశామన్నారు. తమ స్థాయిలో త్వరిత గతిన పరిష్కరించదగ్గ సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. నోటీసుల జారీ ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని పేర్కొన్నారు. దరఖాస్తుల పరిష్కారం ఓటిపి, ఈ కేవైసి ప్రక్రియ చేయడం కొరకు అర్జీదారులకు ముందుగానే సమాచారం ఇవ్వాలన్నారు. కస్టమ్ మిల్లింగ్ రైస్ (సిఎంఆర్) డెలివరీ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఇప్పటి వరకు పూర్తిచేసిన, మిగిలి ఉన్న సిఎంఆర్ ప్రక్రియ కు సంబంధించి వివరాలను మిల్లుల వారిగా సమీక్షించారు. సిఎంఆర్ డెలివరీ వెనుకబడి ఉన్న మిల్లర్లకు నోటీసులు జారీ చేసి చట్ట ప్రకారం కేసులు నమోదు చేయాలన్నారు. రెవెన్యూ రికవరీ చట్టాన్ని ప్రయోగించాలని స్పష్టం చేశారు. మిల్లర్ల ఆస్తులను జప్తు చేసి, వేలం వేయాలని తెలిపారు. రేషన్ కార్డుల ఆమోదం ప్రక్రియ వెంటనే పూర్తి చేయాలని అన్నారు. మండలాల వారిగా రేషన్ కార్డుల ఆమోదం ప్రక్రియ వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. వివిధ రకాల పౌర సేవల ధృవీకరణ పత్రాల జారీలో ఆలస్యం చేయకూడదని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ దరఖాస్తులను వెంట వెంటనే పరిశీలించి, పై స్థాయికి పంపాలని అన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, ఏడి మైన్స్, జియాలజి రవీందర్, పిడి హౌసింగ్ రాజేశ్వర్, భూగర్భజలాల శాఖ అధికారి శ్రీనివాస బాబు, జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్ , మేనేజర్ సుధాకర్, తహసిల్దార్లు, ఇంజనీరింగ్ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.


# నిజాయితీకి ప్రతిరూపంగా నిలిచిన విజయ్ కుమార్ - దొరికిన రెండు లక్షల నలభై ఎనిమిది వేల రూపాయల నగదు ను పోలీసులకు అప్పగింత

## నిజాయితీతో కూడిన చర్యను ప్రత్యేకంగా అభినందించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్



అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి నిర్మల్ పట్టణం లోని ఆదర్శనగర్ కి చెందిన విజయ్ కుమార్ అనే వ్యక్తి తన నిజాయితీతో అందరికీ ఆదర్శంగా నిలిచారు. తను బస్టాండ్ నుండి ఇంటికి వెళ్తున్న సమయంలో జిల్లాలోని కోర్టు వద్ద హోండా షైన్ బైక్‌పై వెళ్తున్న ఓ వ్యక్తి అనుకోకుండా రెండు లక్షల నలభై ఎనిమిది వేల రూపాయల నగదును కింద పడేసుకున్నారు. ఈ విషయాన్ని గమనించిన విజయ్ కుమార్ వెంటనే ఆ వాహనదారుని పలుమార్లు పిలిచినా, ఆయన పట్టించుకోకుండా ముందుకు వెళ్లిపోయారు. దీంతో ఆయన వెంటనే ఈ విషయాన్ని ఇంటలిజెన్స్ ఎస్ఐ సాయన్ రావ్ కు తెలియజేసి,దొరికిన నగదును అప్పజెప్పాడు. ఈ నిజాయితీతో కూడిన చర్యను జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల ఐపీఎస్ గారు హర్షిస్తూ విజయ్ కుమార్‌ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డా: జి జానకి షర్మిల ఐపిఎస్ మాట్లాడుతూ.. "ఇలాంటి నిజాయితీ గల వ్యక్తులు సమాజానికి ఆదర్శం, సమాజం లో ప్రతి ఒక్కరు అన్ని విషయాల్లోనూ బాధ్యతగా ప్రవర్తించాలి, ఇలాంటి వారి వల్లే మంచి విలువలు చిరస్థాయిగా నిలిచిపోతాయి," అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

# జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో తక్షణ మరమ్మత్తుల కోసం అవసరమైన నివేదికలను సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు.





అమృత్ తెలంగాణ నిర్మల్ ప్రతినిధి మంగళవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ పాఠశాలలలో వివిధ మరమ్మత్తుల పనుల నిర్వహణ పై కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠశాలల్లో మరుగుదొడ్లు, పైకప్పులు (స్లాబ్), ప్రహరీ గోడలు తదితర మౌలిక సదుపాయాలకు సంబంధించిన మరమ్మత్తులపై స్పష్టమైన అంచనాల నివేదికలను తక్షణం రూపొందించాలని ఆదేశించారు. అత్యవసరంగా అవసరమైన పనులను మంజూరైన నిధులతోనే పూర్తిచేయాలని సూచించారు. ఇప్పటికే శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాల కూల్చివేతను దశలవారీగా చేపడుతున్నట్టు తెలిపారు. భవిత కేంద్రాల్లో దివ్యంగా పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్, కేజీబీవీ సమన్వయకర్త సలోమి కరుణ, అధికారులు ప్రవీణ్, రాజేశ్వర్, తదితరులు పాల్గొన్నారు.

# గాంధీభవన్‌లో బోనాల పండగ.. అమ్మవారికి బోనాలు సమర్పించిన టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణక్క





అమృత్ తెలంగాణ ఉట్నూర్ న్యూస్ :ఉట్నూర్: ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని తెలంగాణలో బోనాల సందడి నెలకొంది. పోతురాజుల వీరంగాలు, శివసత్తుల ఆటలతో శోభ సంతరించుకుంది. ఈ క్రమంలోనే మంగళవారం హైదరాబాద్ లోని గాంధీభవన్‌లో ఘనంగా బోనాల పండగ నిర్వహించారు. రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో టీపీసీసీ ఉపాధ్యక్షురాలు,రాష్ట్ర మహిళా కాంగ్రెస్ ఇంచార్జ్ ఆత్రం సుగుణక్క పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళా కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బోనమెత్తిన సుగుణక్క మహిళ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతా రావు తో కలిసి అమ్మవారికి బోనాలు సమర్పించారు. రాష్ట్రంలోని ప్రజలందరూ సుఖ, సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారికి బోనాలు సమర్పించినట్టు సుగుణక్క వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇందిరా ఫెలోషిప్ నిర్మల్ జోనల్ ఇన్చార్జ్ కృష్ణవేణి రెడ్డి, ఇంద్రరావు, నిర్మల్ జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు భవాని తదితరులు పాల్గొన్నారు. ఆత్రం సుగుణక్క క్యాంప్ ఆఫీస్, ఉట్నూర్ఉట్నూర

# పోస్ట్ ఆఫీస్ సేవలపై ప్రజల అసంతృప్తి

ఉప్పునుంతల :అమృత్ తెలంగాణ: నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట, ఉప్పునుంతల మండలం గ్రామీణ ప్రాంతాల్లో పోస్ట్ బ్రాంచ్ సేవలపై ప్రజల్లో తీవ్రమైన అసంతృప్తి నెలకొంది. ఉప్పునుంతల మండలంలోని కొన్ని గ్రామాల్లో సకాలంలో ఉత్తరాలు అందకపోవడం, కొందరికి చెందాల్సిన పోస్టులు ఇతరులకు చేరడం వంటి విషయాలు ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేస్తున్నాయి. ఈ విషయంలో గ్రామ యువత ముందుకొచ్చి, పోస్ట్ బ్రాంచ్ లో కొనసాగుతున్న పనిచర్యలపై రాతపూర్వకంగా వినతిపత్రం సిద్ధం చేశారు. గ్రామస్థుల సంతకాలతో కూడిన ఈ వినతిపత్రాన్ని వారు జిల్లా పోస్టల్ ఇన్స్పెక్టర్‌కు వాట్సాప్ ద్వారా పంపించారు. వినతిపత్రంలో చందాపూర్ పోస్ట్ బ్రాంచ్ ఆఫీసర్ ఉద్యోగుల పనితీరుపై పూర్తిస్థాయి విచారణ జరిపి, నిర్లక్ష్యానికి కారణమైనవారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అలాగే భవిష్యత్తులో ఇటువంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకొని, పోస్టల్ సేవలు నాణ్యంగా అందేలా పర్యవేక్షణ మరింత కఠినంగా చేయాలని కోరారు. సాంకేతిక పరిజ్ఞానం ఉన్నప్పటికీ ఈ రకమైన నిర్లక్ష్యం సరి కాదని, తమకు వచ్చే ముఖ్యమైన సమాచారం ఆలస్యం కావడం వల్ల నష్టాలు కలుగుతున్నాయని వాపోయారు. ఇది ప్రభుత్వ యంత్రాంగం నిర్లక్ష్యానికి నిదర్శనమని అభిప్రాయపడ్డారు. ప్రజల ఈ ఆవేదనను అధికారులు గుర్తించి వెంటనే స్పందించాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోంది. ప్రజా సేవలపై భరోసా కోల్పోకూడదని, పాలనా వ్యవస్థ ఆ సమస్యలపై తక్షణమే జిల్లా పోస్ట్ ఇన్స్పెక్టర్ వెంటనే స్పందించాలనీ వారు డిమాండ్ చేశారు. గ్రామాల్లోకి వస్తున్న ఉత్తరాలు చందాపూర్ పోస్ట్ ఆఫీస్ అధికారి ఒకరి ఉత్తరాలు మరొకరికి ఇస్తూ గ్రామంలో ప్రజలకు ఇబ్బందులు కలిగేలా వ్యవహరిస్తున్నారు.

# ఎమ్మెల్యే వంశీకృష్ణ నివాళ నేతల అశ్రునివాళులు

ఉప్పునుంతల : అమృత్ తెలంగాణ: ఉప్పునుంతల మండల కేంద్రానికి చెందిన ప్రముఖులు, నలుగురిలో ముద్దుబిడ్డగా పేరొందిన కొత్త చిన్న జంగి రెడ్డి ఆదివారం అనారోగ్యంతో తుదిశ్వాస విడిచిన సంగతి తెలిసిందే. ఆయన మృతి పట్ల పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ స్వయంగా స్వగ్రామానికి చేరుకుని, మృతదేహానికి పూలమాల వేసి అశ్రునివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి మద్దతుగా నిలిచారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అనంతరెడ్డి, మాజీ ఎంపీపీ నరసింహారెడ్డి, అనుష ప్రాజెక్ట్ ప్రైవేట్ అధినేత జలంధర్ రెడ్డి, స్థానిక నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. జంగి రెడ్డి మృతి పట్ల వారు తీవ్ర విచారం వ్యక్తం చేస్తూ ఆయన సేవలను స్మరించుకున్నారు.

# ఘనంగా వాత్సల్య ఫార్మసీ కళాశాలలో స్నాతకోత్సవ వేడుకలు

భువనగిరి :అమృత్ తెలంగాణ: భువనగిరి మండలంలోని అనంతారం గ్రామంలో గల వాత్సల్య ఫార్మసీ కళాశాలలో కాన్వకేషన్ డే ఘనంగా జరుపుకున్నారు. ముందుగా వాత్సల్య ఫార్మసీ కళాశాల ఫౌండర్ దరిపల్లి అనంతరాములు చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వాత్సల్య కళాశాల చైర్మన్ దరిపల్లి నవీన్ కుమార్, కరస్పాండెంట్ దరిపల్లి ప్రవీణ్ కుమార్ లు మాట్లాడుతూ కాన్వకేషన్ డే సందర్భంగా వాత్సల్య గ్రూప్ ఆఫ్ ఇన్స్టిట్యూషన్స్ చైర్మన్ దరిపల్లి నవీన్ కుమార్ మాట్లాడుతూ వాత్సల్య లో విద్యను అభ్యసించిన విద్యార్థినీ విద్యార్థులు వారి చదువుతోపాటు ఫార్మసీ రంగంలో నిర్వహిస్తున్న వివిధ ఫార్మా ఫెస్ట్ లలో పేపర్ ప్రజెంటేషన్లు, సెమినార్లలో పాల్గొనాలని అన్నారు. విద్యార్థిని విద్యార్థులు వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకోవాలని అన్నారు. బీఫార్మసీ పూర్తి చేసుకున్న ప్రతి ఒక్క విద్యార్థి ఒక ఎంటర్ప్రెనేరుగా ఎదగాలని, వారి ఉపాధి పొందుతూ పలువురికి ఉపాధి కల్పించాలని, ఫార్మా కంపెనీలు స్థాపించాలని, అంతేకాక నూతన ఫార్మాడ్రగ్స్ ని కనిపెట్టాలని అన్నారు. ప్రపంచాన్ని వనికించిన కోవిడ్ మహమ్మారి నుండి మానవాళిని కాపాడడానికి మొట్టమొదటిగా వ్యాక్సిన్ కనిపెట్టింది భారత్ బయోటెక్ మన భారత ఫార్మసిస్టులే అని గుర్తు చేశారు. ప్రస్తుతం ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలో మన హైదరాబాద్ ఇప్పుడు ఫార్మా హబ్ గా ఉన్నదని చెప్పి అన్నారు. బీఫార్మసీ పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులకు మంచి ఉపాధి అవకాశాలు ఉన్నాయని చెప్పి అన్నారు. విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఇవ్వడంలో మా కళాశాల ఎప్పటికీ




ముందుంటుందని, ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉంటాయని ప్రతి సంవత్సరం క్యాంపస్ ప్లేస్మెంట్స్ , జాబ్ మేళాలను నిర్వహించి విద్యార్థులందరికీ ఉద్యోగ అవకాశాలు ఇస్తున్నామని అన్నారు. అనంతరం యాదాద్రి భువనగిరి జిల్లా ప్రభుత్వ మెడికల్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మణరావు బీఫార్మసీ పూర్తి చేసుకున్న విద్యార్థిని విద్యార్థులకు గోల్డ్ మెడల్స్ పట్టాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రిన్సిపల్ శ్రీధర్ బాబు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో పెట్రోల్ పోసుకున్న రైతు భూమిని పరిశీలించిన తహశీల్దార్..



బొమ్మలరామారం :అమృత్ తెలంగాణ: తన పేరున ఉన్న రెండు ఎకరాల మూడు గుంటల భూమి ఇతరుల వెళ్లిందని ఆవేదనతో సోమవారం కలెక్టరేట్లో బాదిత రైతు పెట్రోల్ పోసుకున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్ శ్రీనివాసరావు నాగిని పల్లి గ్రామంలో గల భూమిని మంగళవారం ఆర్ఐ వెంకట్ రెడ్డి, సర్వేయర్ శ్రీనివాస లతో కలిసి పరిశీలించారు. బాధిత రైతు తన భూమి హద్దులను సరిగా గుర్తించడం లేదని, ఈ మేరకు తన భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించాలని రెవెన్యూ అధికారులను కోరినట్లు తెలిసింది. బాధిత రైతు విన్నపం మేరకు సర్వే నెంబర్లలో గల రైతులకు నోటీసులు జారీ చేసి భూమిని సర్వే చేయనున్నట్లు రెవెన్యూ అధికారులు తెలిపారు.

# మహిళా శక్తి సంబరాలపై అవగాహన సమావేశం..

భువనగిరి :అమృత్ తెలంగాణ: “మహిళా శక్తి సంబరాలు” లో భాగంగా జిల్లా కలెక్టర్ కార్యాలయంలో యాదాద్రి భువనగిరి జిల్లాలోని అన్ని మున్సిపాలిటీల మున్సిపల్ కమిషనర్లు, మెప్మా సిబ్బంది, రిసోర్స్ పర్సన్లు తో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు భాస్కర్ రావు అవగాహన సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ సంబరాల్లో భాగంగా జిల్లాలోని ప్రతి మున్సిపాలిటీ లో మహిళా సంఘాల సమావేశాలు, కళాజాత కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమగ్రతతో ప్రజలలో అవగాహన పెంచేలా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిదారులను తక్షణమే గుర్తించి,అవసరమైన బ్యాంక్ లోన్లు, శ్రీనిధి ,సిఐఎఫ్ నిధుల ద్వారా ఆర్థిక సహాయం కల్పించి, గృహ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశము లో జిల్లా గ్రామీణాభివృద్ధి



శాఖ అధికారి నాగిరెడ్డి , మున్సిపల్ కమీషనర్లు, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# పోలీస్ కళా బృందంచే మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్ పై అవగాహన





ఏర్గట్ల ::అమృత్ తెలంగాణ: ఏర్గట్ల మండలకేంద్రంలో నిజామాబాద్ పోలీస్ కళా బృందం వారు మాదక ద్రవ్యాలు,గంజాయి, హెల్మెట్ ధరించడం, సైబర్ క్రైం గురించి మంగళవారం ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏర్గట్ల ఎస్సై పడాల రాజేశ్వర్ మాట్లాడుతూ యువకులు గంజాయికి,మాదక ద్రవ్యాలకు అలవాటు పడి తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ను ధరించి రోడ్డు ప్రమాదాల నుండి తమను తాము కాపాడుకోవాలని సూచించారు. సైబర్ క్రైం లో భాగంగా ప్రజలు అప్రమత్తతో ఉండాలని,ఫోన్ కు వచ్చే అనవసర మెసేజ్ లను,లింక్ లను ఓపెన్ చేయవద్దని,అలా చేస్తే తమ బ్యాంక్ ఖాతా ఖాళీ అయ్యే ప్రమాదం ఉందని అన్నారు.

# వైయస్ఆర్ 76వ జయంతి దినోత్సవ వేడుకలు

భువనగిరి:అమృత్ తెలంగాణ: సంక్షేమ సారధి, రైతు బాంధవుడు, ఎంతో మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపిన మాజీ సీఎం, డా. వైయస్ రాజశేఖర్ రెడ్డి 76వ జయంతి సందర్భంగా కిసాన్ నగర్ లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కనుకుంట్ల కొండల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించగా.. పలువురు హాజరై మాట్లాడారు. వైయస్సార్ ఆశయ సాధన కోసం యువజన కాంగ్రెస్ పక్షాన నిరంతరం కృషి చేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు మంగ ప్రవీణ్, అసెంబ్లీ ఉపాధ్యక్షులు చేగూరి బాలు, నాయకులు సాల్వేరు ఉపేందర్, పిట్టల వెంకటేష్, జమ్ముల కుమార్ యువజన కాంగ్రెస్ బోనిగిరి మండల ప్రధాన కార్యదర్శి అసద్, గొల్లపల్లి జానకిరామ్ లు పాల్గొన్నారు.



# రుహాని టాలెంట్ గుర్తించాల్సిందే..!



చి.ల.సౌ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన భామ రుహాని శర్మ. ఆ సినిమాలో స్ట్రాంగ్ ఉమెన్ గా రుహాని నటనకు మంచి మార్కులు పడ్డాయి. ఒక్క మూవీతోనే యూత్ లో రుహానికి మంచి ఫాలోయింగ్ ఏర్పడింది. ఇక ఆ తర్వాత రుహాని హిట్ సినిమాలో కూడ నటించింది. శైలేశ్ డైరక్షన్ లో విశ్వక్ సేన్ హీరోగా వచ్చిన హిట్ మూవీ కూడా అమ్మడి ఖాతాలో మరో హిట్ పడేలా చేసింది. ఆ తర్వాత డర్టీ హరి నూటొక్క జిల్లాల అందగాడు సినిమాల్లో కూడా నటించింది ఈ భామ. ఇక్కడే కాకుండా బాలీవుడ్ లో మ్యూజిక్ వీడియోలో కూడా రుహాని అదరగొట్టేసింది. ప్రస్తుతం ఆగ్రా మీట్ క్యూట్ సినిమాల్లో నటిస్తున్న రుహాని శర్మ గ్లామర్ షో చేయడంలో మాత్రం వెనకడుగు వెయట్లేదు. అమ్మడు చేస్తున్న ఈ షోకి రోజు రోజుకి తన ఫాలోవర్స్ పెరుగుతూ వస్తున్నారు. స్కిన్ షోలో నావెల్టీని జోడీస్తూ రుహాని చేస్తున్న ఫోటో షూట్ కి ప్రత్యేక ఆకర్షణ అవుతున్నారు నెటిజెన్లు. అంతేకాదు లేటెస్ట్ గా ఓ సాంగ్ కి డ్యాన్స్ చేస్తూ వీడియో చేసింది అమ్మడు. ఆ వీడియోని తన ఇన్ స్టా రీల్స్ లో షేర్ చేసింది. ఛాన్స్ దొరికితే ఎలాగోలా ప్రేక్షకులను మెప్పించాలని చూస్తున్న రుహాని శర్మ ప్రయత్నాలు వర్క్ అవుట్ అవుతున్నాయని చెప్పొచ్చు. అందం అభినయం రెండు కలగలిపి ఉన్న రుహానికి ఇంకా ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదని చెప్పొచ్చు. తనకి ఇచ్చిన పాత్రలో మెప్పిస్తూ వస్తున్న రుహాని శర్మ స్టార్ సినిమా ఛాన్సుల కోసం ఎదురుచూస్తుంది. లేటెస్ట్ ఇన్ స్టా రీల్స్ తో సోషల్ మీడియాలో వైరల్ గా మారిన రుహాని శర్మ.

# ఈ వెయిటింగ్ దేనికోసం అమ్మడు..?

రెండు బ్యాక్ టు బ్యాక్ హిట్లతో మృణాల్ అదరగొట్టగా ఇక టాలీవుడ్ లో అమ్మడికి తిరుగులేదని అనుకున్నారు. సీతారామం సినిమాతో తెలుగు ప్రేక్షకులకు మెప్పించిన బ్యూటీ మృణాల్ ఠాకూర్ అంతకుముందు బాలీవుడ్ సీరియల్స్ తో పాటు సినిమాలు కూడా చేసినా రాని క్రేజ్ అమ్మడికి సీతారామం తో వచ్చింది. సినిమాలో సీతామహాలక్ష్మి, నూర్జహాన్ పాత్రల్లో మృణాల్ అదరగొట్టేసింది. టాలీవుడ్ కి మరో స్టార్ హీరోయిన్ వచ్చిందని అందరు ఫిక్స్ అయ్యారు. సీతారామం తర్వాత నానితో హాయ్ నాన్న సినిమా చేసింది అమ్మడు. ఆ సినిమాలో కూడా తన నటనతో ఇంప్రెస్ చేసింది. రెండు బ్యాక్ టు బ్యాక్ హిట్లతో మృణాల్ అదరగొట్టగా ఇక టాలీవుడ్ లో అమ్మడికి తిరుగులేదని అనుకున్నారు. సూపర్ ఛాన్స్ కొట్టేసిన శివానీ కానీ విజయ్ దేవరకొండతో చేసిన ఫ్యామిలీ స్టార్ సినిమా డిజప్పాయింట్ చేసింది. ఆ సినిమా హిట్ అయితే పరిస్థితి ఎలా ఉండేదో కానీ ఆ సినిమా ఫ్లాప్ అవ్వడం వల్ల మృణాల్ కెరీర్ రిస్క్ లో పడింది. రెండు హిట్లు పడినప్పుడు కాదు ఒక్క ఫ్లాప్ పడగానే బ్యాడ్ లక్ వెంటాడుతుంది. అందుకే తెలుగులో అమ్మడికి చేతిదాకా వచ్చిన సినిమాలు చేజారిపోయాయి. పోనీ బాలీవుడ్ లో ఏమైనా వరుస ఆఫర్లు ఉన్నాయా అంటే అక్కడ అరకొర అవకాశాలే తప్ప పెద్దగా ఛాన్స్ లు రావట్లేదు. ఐతే తెలుగులో కొన్ని ఆఫర్లు వస్తున్నా కూడా మృణాల్ వాటిని వెయిటింగ్ లో పెట్టినట్టు తెలుస్తుంది. మరి కెరీర్ అటు ఇటుగా ఉన్నప్పుడు కూడా ఈ వెయిటింగ్ లు గట్రా దేనికన్నది అర్థం కావట్లేదు. ఐతే ఒక ఆఫర్ కి ఓకే చెప్పాక దానికంటే బెటర్ ఆఫర్ వస్తే కష్టం కదా అని మృణాల్ భావిస్తుంది. ఐతే అలా వెయిట్ చేస్తూ ఆఫర్లను హోల్డ్ లో పెడుతూ వస్తే ఇక ఉన్న ఆ ఒక్క ఛాన్స్ కూడా చేజారే అవకాశం ఉంటుంది. కథల విషయంలో నచ్చక వెయిట్



చేయడం మంచి విధానమే కానీ మరీ మృణాల్ ఠాకూర్ ఇలా రెండు హిట్లు ఒక ఫ్లాప్ పడగానే డీలా పడిపోవడం ఆమె ఫ్యాన్స్ ని కన్ ఫ్యూజ్ చేస్తుంది. మృణాల్ మళ్లీ తిరిగి తెలుగులో వరుస సినిమాలు చేయాలని ఆమె ఫాలోవర్స్ కోరుతున్నారు. ఐతే సినిమాల పరంగా దూరంగా ఉంటున్నా అమ్మడు ఫోటో షూట్స్ తో ఆడియన్స్ కు రెగ్యులర్ గా టచ్ లోనే ఉంటుంది. తప్పకుండా మృణాల్ కి మళ్లీ మంచి అవకాశాలు రావాలని ఆమె ని ఇష్టపడే ఆడియన్స్ కోరుతున్నారు.


# అమ్మకు అచ్చు గుద్దిన అందం హీరోయిన్గా!

కోలీవుడ్ లో ఇప్పటికే మామ్ క్రేజ్ తో కొంత మంది భామలు హీరోయిన్లగా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. కోలీవుడ్ లో ఇప్పటికే మామ్ క్రేజ్ తో కొంత మంది భామలు హీరోయిన్లగా ఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. రాధ కుమార్తెలిద్దరు కార్తీక, తులసి ఇద్దరు ఎంట్రీ ఇచ్చారు. కానీ ఇండస్ట్రీలో వాళ్లు సక్సెస్ కాలేదు. కొన్ని సినిమాలు చేసి వెనుదిరిగారు. అలాగే యాక్షన్ కింగ్ అర్జున్ కుమార్తె ఐశ్వర్య కూడా లాంచ్ అయింది. కానీ ఆమె కూడా నిలదొక్కుకోలేకపోయింది. వివాహం చేసుకుని ఓఇంటిదైంది. కార్తిక కూడా పెళ్లి చేసుకుని స్థిరపడింది. ఇలా కెలికితే కొంత మంది భామల పేర్లు తెరపైకి వస్తాయి. అయితే ఇప్పుడా సెంటిమెంట్ ని బ్రేక్ చేస్తూ ముందకు సాగాల్సిన బాధ్యత ఈ నయ వారసురాళ్లపై ఉంది.



సుందర్ .సి–ఖుష్బూలకు ఇద్దరు అందమైన కుమార్తెలు అవంతిక, ఆనందిత ఉన్నారు. అవంతిక అయితే అచ్చంగా అమ్మనే పోలి ఉంటుంది. ఖుష్బూ నోట్లో నుంచి ఊడిపడినట్లే ఉంటుంది. ఇటీవలే ఇద్దరు చదువులు కూడా పూర్తి చేసారు. ఈ నేపథ్యంలో అవంతిక మ్యాకప్ వేసుకోవడానికి రెడీ అవుతోంది. తాజాగా అమ్మడు ఓ ఫోటోషూట్ లో పాల్గొంది. బ్రౌన్ కలర్ బ్లౌజ్ పై షర్ట్ ధరించి నేలపై కూర్చుని కెమారాకి వివిధ భంగిమల్లో ఫోజులిచ్చింది. కవ్వించే కిల్లర్ లుక్ లో కట్టిపడేసింది. అమ్మడి ఎదపై సొగసైన టాటూ తో వావ్ అనిపించింది.

## అమృత్ తెలంగాణ సినిమా వార్తలు



అన్వేషి జైన్ హాట్ ఇన్ వైట్

Printed, Published and Owned by SIGIDI AMRUTH.D.NO: 184C. OLD HOUSING BOARD COLONY -504309, ADILABAD DISTRICT, TELANGANA. CELL : 9849973404. E-Mail- singidiamruth404@gmail.com